'సంక్షేమ హాస్టళ్లలో మంత్రులు, అధికారులు రోజూ ఒక పూట భోజనం చేయాలి'

బర్కత్‌పుర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ సంక్షేమ హాస్టల్స్‌లో మంత్రులు, అధికారులు ప్రతిరోజు ఒక పూట భోజనం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారధన్ మహారాజ్ విజ్ఞప్తి చేశారు. రోజూ ఒక అధికారి హాస్టల్స్‌లో భోజనం చేస్తే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం దక్కుతుందన్నారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ డిమాండ్‌తో ప్రేమలేఖ రాసినట్లు ఆయన తెలిపారు. మంత్రులు, కలెక్టర్లు, అధికారులు ఒక్క రోజు హాస్టల్స్‌ను సందర్శించి భోజనం చేసినంత మాత్రానా విద్యార్థులకు మంచి భోజనం ఆ ఒక్క రోజు మాత్రమే అందుతుందని, తర్వాత పరిస్థితి యథావిధిగా ఉంటుందని తెలిపారు. ఇలా చేస్తే తెలంగాణలో సామాజిక విప్లవం వస్తుందన్నారు. 10 లక్షల మంది విద్యార్థులు సంక్షేమ హాస్టల్స్‌లో ఉంటున్నారని ఒక్కొక్క హాస్టల్ విద్యార్థికి రోజుకు వంద రూపాయల చొప్పున నెలకు 3 వేల రూపాయల మెస్ చార్జీలను విడుదల చేయాలని కోరారు.


సాయిదేవ్‌కు బిరుదు ప్రదానం చేస్తున్న సినీనటుడు ఉత్తేజ్

సాయిదేవ్‌కు 'సంగీత విద్వాన్' బిరుదు ప్రదానం

చిక్కడపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాయిదేవ్‌కు సంగీత విద్వాన్ బిరుదు ప్రదానం చేశారు. త్యాగరాయగానసభలో ఆదివారం మధుస్వరమాలిక సంస్థ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన నవరస సుమమాలిక సంగీత కార్యక్రమంలో సాయిదేవ్‌కు బిరుదును సినీనటుడు ఉత్తేజ్ బహూకరించి సత్కరించారు. అదేవిధంగా దేవులపల్లి కృష్ణశాస్త్రి వంశీయులు రమణ, ఫోక్ ఆర్టిస్ట్ మణిబహద్దూర్‌లకు సన్మానం చేశారు. ప్రముఖ సినీ గాయకుడు శివంతో పాటు ముప్పై మంది గాయనీగాయకులు ఉదయం నుంచి రాత్రి వరకు పాటలు ఆలపించారు. సంస్థ అధ్యక్షురాలు ఉమామాధవి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ భాషా, సాంస్కృతికశాఖ, విశ్వసముద్ర, కెనరాబ్యాంక్‌లు ఈ కార్యక్రమానికి సౌజన్యం అందించాయి.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వెలుదండ నిత్యానందరావు తదితరులు

జయరాములు రచించిన మూడు గ్రంథాల ఆవిష్కరణ

చిక్కడపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత డా.బి.జయరాములు రచించిన అమెరికా - హైదరాబాద్-2, ఆత్మీయులు, శ్రీ శంభులింగేశ్వర శతకం గ్రంథాల ఆవిష్కరణ సభ ఆదివారం త్యాగరాయగానసభలో కమలాకృష్ణ కళాకౌముది, కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. పుస్తకాలను ఆవిష్కరించిన తెలుగు యూనివర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ.. ఈ రచనలు బాల్యస్మృతులు, విదేశీ విశేషాలు, కుటుంబసంబంధాలను వివరించాయన్నారు. ఆవిష్కృత గ్రంథాలను ఆచార్య పి.వారిజారాణి విశ్లేషణాత్మకంగా పరిచయం చేశారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, రాదాకుసుమ, సుశీల, దశరథరామయ్య, సోమయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతం

బర్కత్‌పుర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ పీఎస్ పరిధిలోని 4 సెంటర్లలో గ్రూప్-2 పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా ముగిసింది. గ్రూప్-2 అభ్యర్థులు సెంటర్లకు ఉదయం 7 గంటల నుంచే రావడం ప్రారంభించారు. గ్రూప్-2 అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. సోమవారం రెండో పేపర్ కొనసాగనుంది. కాచిగూడ పీఎస్ పరిధిలోని శ్యామలాదేవి బాలికల జూనియర్ కళాశాలలో 312 అభ్యర్థులకు గానూ 137 మంది హాజరయ్యారు. బద్రుకా కళాశాలలో 768 మందికి 323 మంది, అవంతి కాలేజీలో 480 మందికి 155 మంది అభ్యర్థులు, కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 240 మందికి కేవలం 62 మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్షా సెంటర్ల వద్ద 144 సెక్షన్ విధించినట్లు కాచిగూడ అడ్మిని ఎస్ఐ సుభాష్ తెలిపారు.

రామకృష్ణమఠంలో స్వామి రంగనాథనందా జయంతి


డాక్టర్ వినయ్ సహస్ర బుద్దేకు మెమోంటో అందజేస్తున్న స్వామి బోదమయానంద

కవాడిగూడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్ బండ్‌లోని రామకృష్ణమఠంలో స్వామి రంగనాథనందా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ కల్చర్ అండ్ ఇట్స్ సాఫ్టవర్ స్ట్రెంత్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యకమానికి ముఖ్యఅతిథిగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్ అధ్యక్షుడు డాక్టర్ వినయ్ సహస్ర బుద్దే హాజరై మాట్లాడారు. సర్వమానవ, సర్వప్రాణికోటి శ్రేయస్సును కోరుకునే భారత్ అనాదిగా విశ్వానికి మిత్రుడిగా ఉందన్నారు. యోగా, ఆయుర్వేదం, ఆధ్యాత్మికం అనేది భారత్ ప్రపంచానికి అందించిన వరాలు అని అన్నారు. రామకృష్ణమఠం హైదరాబాద్ అధ్యక్షుడు స్వామిబోదమయానంద మాట్లాడుతూ హైదరాబాద్ రామకృష్ణమఠం తొలి అధ్యక్షుడుగా రామకృష్ణమఠం మిషన్ 13వ సర్వాధ్యక్షుడుగా స్వామిరంగనాథనందా తన పనితీరు, వ్యక్తిత్వంతో లక్షలాది మందికి స్ఫూర్తినివ్వడమే కాక రామకృష్ణమఠం చరిత్రలో చెరగని ముద్రవేశారని అన్నారు. కార్యక్రమంలో దేశ నలుమూలల నుంచి వచ్చిన రామకృష్ణమఠం వివిధ శాఖల స్వాములు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్‌గౌడ్

జూపల్లిని ఎక్సైజ్ మంత్రి పదవి నుంచి తొలగించాలి

కవాడిగూడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత వృత్తి, కల్లు దుకాణాలపై ఎక్సైజ్, నార్కోటిక్ అధికారులు, పోలీసుల దాడులు పెరిగిపోతున్నాయని, దీనికి నైతిక బాధ్యతగా జూపల్లి కృష్ణారావును ఎక్సైజ్ శాఖ మంత్రి పదవి నుంచి తొలగించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లు జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు కామారెడ్డి డిక్లరేషన్‌లో 25 శాతం వైన్స్, బార్లలో గౌడ కులస్థులకు రిజర్వేషన్ కల్పిస్తామని పేర్కొన్నారని అందుకు విరుద్ధంగా కల్లు గీత కార్మికులపై అణచివేత ధోరణి అవలంభిస్తున్నారని ఆరోపించారు. ఆదివారం కవాడిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీనే మంత్రిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలు సంఘాల నేతలు ఇడిగ శ్రీనివాస్, ఇంద్రం రజక, గూడురు భాస్కర్, కార్తీక్‌గౌడ్, అర్జున్, మధుసూదన్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ లీకేజీలపై అధికారులు చర్యలు తీసుకోవాలి


డ్రైనేజీ పనులను చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

నల్లకుంట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో నెలకొన్న తాగునీటి కలుషిత సమస్య, డ్రైనేజీ లీకేజీలపై జలమండలి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ యాకర అమృత సూచించారు. డివిజన్‌లోని న్యూనల్లకుంటలో నెలకొన్న డ్రైనేజీ లీకేజీ సమస్యపై స్థానికులు ఆదివారం ఆమెకు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ఆమె జలమండలి సిబ్బందితో డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై ఎప్పటికప్పుడు గుర్తించిన ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, బీజేపీ నేతలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో అంబేడ్కర్‌నగర్ గృహాలు

- గోడలకు బీటలు.. పెచ్చులూడుతున్న పై కప్పులు
- ఆందోళనలో కుటుంబాలు


శిథిలావస్థకు చేరుకున్న అంబేడ్కర్‌నగర్‌లోని ఇళ్లు

ముషీరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం నిర్మించిన పక్కా గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పక్కా గృహాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భవనం స్లాబ్ పెచ్చులు ఊడడంతోపాటు గోడలు బీటలు వారుతున్నాయి. ఈ ప్రమాదకర పరిస్థితి ముషీరాబాద్ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లోని పక్కా గృహాల పరిస్థితి

శిథిలావస్థకు చేరడంతో..

అంబేడ్కర్‌నగర్‌లోని సర్వేనెంబర్ 182లోని స్థలంలో 1986లో 82 మందికి పట్టాలు ఇచ్చి 1997లో వాంబే పథకం కింద పక్కా గృహాలు నిర్మించి ఇచ్చారు. అందులో జీ ప్లస్ వన్ భవనాలను నిర్మించి 42 కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇచ్చారు. ఇళ్లు రోజురోజుకూ శిథిలావస్థకు చేరుకోవడంతో పైకప్పు పెచ్చులు ఊడి కిందపడిపోతున్నాయి. ఏకంగా స్లాబ్ పైకప్పు ఇనుప ఊచలు సైతం కనిపించేలా సిమెంట్ కూలిపోయి ఇళ్లల్లో పడిపోతున్నాయి. స్థానికులు భవనం దుస్థితి చూసి ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.


కింద పడిన భవనం పై కప్పు పెచ్చులు, ఇన్‌సెట్‌లో శిథిలమైన పైకప్పు

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

అంబేడ్కర్‌నగర్‌లో ఆటోడ్రైవర్లు, దినసరి కూలీలు, వివిధ పనులు చేస్తూ అంబేడ్కర్‌నగర్‌లోని పక్కా గృహాల్లోనే ఉంటున్నావే. పేదలు ఈ ఇళ్లలోనే ఉంటున్నారు. అంబేడ్కర్ గృహాలు ప్రమాదకరంగా మారాయని, ఎప్పుడు ఏమి జరుగుతుందోనని సంబంధిత శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికలప్పుడే తమ ప్రాంతాలకు వచ్చి ఇళ్లు కట్టిస్తామని హామీలు ఇస్తున్నారే తప్పా.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేశాం



అంబేడ్కర్‌నగర్‌లో నిర్మించిన భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇదే స్థలంలో కొత్త ఇళ్లు కట్టించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశాం. హౌసింగ్‌బోర్డు అధికారులను కలిసి భవనం దుస్థితి ఫొటోలు అందజేశాం.

- సత్యనారాయణ, అంబేడ్కర్‌నగర్ అధ్యక్షుడు

పైకప్పు ఊడిపోతోంది



తమ ఇళ్లు శిథిలావస్థకు చేరుకొని గోడలు బీటలు బారుతున్నాయి. ఇళ్ల పై కప్పులు పెచ్చులు ఊడి కిందపడుతున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందో అని ఆందోళన పడుతున్నాం. తమకు న్యాయం చేయాలి.

- కె.సునీత, స్థానికురాలు

పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి



అంబేడ్కర్‌నగర్ పక్కా గృహాలు శిథిలావస్థకు చేరుకున్న విషయం జీహెచ్ఎంసీ హౌసింగ్ బోర్డు అధికారులకు, కేంద్రమంత్ర కిషన్‌రెడ్డి, డాక్టర్ కె.లక్ష్మణ్‌కు ఫిర్యాదు చేశాం. పక్కా గృహాలు నిర్మించి ఇచ్చేలా తమ వంతు కృషి చేస్తున్నాం.

- సుప్రియా నవీన్‌గౌడ్, ముషీరాబాద్ కార్పొరేటర్


మాట్లాడుతున్న బీవీ రాఘవులు

భారతీయులకు రాజ్యాంగమే స్ఫూర్తి

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

రాంనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతీయులు విశ్వమానవులని, వారిని ఒక్కటిగా ఉంచగలిగింది మన రాజ్యాంగమేనని, దానిని కాపాడుకోవడం భారతీయుల తక్షణ కర్తవ్యమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకుడు అక్షయకుమార్‌దత్ సంస్మరణ సభ టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అక్షయ్‌కుమార్ దత్ లౌకికవాది, మానవతావాది, సమతావాది అన్నారు. మన అస్తిత్వం, భారతీయత, భారతీయులందికీ సమానమైన హక్కులు ఉండాలన్నారు. రాజ్యాంగంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయన్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య, మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలుగు భాష వైభవాన్ని నేటి తరాలకు తెలపాలి


భువనవిజయం కళాకారులను అభినందిస్తున్న రమణాచారి తదితరులు

చిక్కడపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష సంపద అనంతం, అపురూపం అని దాని వైభవాన్ని నేటి తరానికి తెలపాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. చిమ్మపూడి ఫౌండేషన్ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం త్యాగరాయ గానసభలో యువ భువన విజయం సాహిత్యం సంగీత రూపకం ప్రదర్శించారు. హైస్కూల్ విద్యార్థులతో పాటు ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా ఈ రూపకంలో పాల్గొని పద్యాలతో సంభాషణలతో రక్తికట్టించారు. అనంతరం జరిగిన సభలో డా.రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను సత్కరించి మాట్లాడారు. పెద్దలు ఎందరో గతంలో భువన విజయం రూపకం ప్రదర్శించి ప్రాచుర్యం కల్పించారని దాని కొనసాగింపుగా యువత అందిపుచ్చుకుని కొనసాగించడం ప్రశంసనీయమన్నారు. సాధన నరసింహాచార్య, రచయిత్రి డా.ముక్తేవి భారతి, లలితాణి, మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, యదుమోహన్ పాల్గొన్నారు. చిమ్మపూడి శ్రీరామమూర్తి కార్యక్రమం నిర్వహించారు. మురళీకృష్ణ చిమ్మపూడి సుభాషిణి అరుణకుమారి, అప్పాజీ, శ్రీనివాస్ సమన్వయం చేశారు.

మృతదేహం స్వాధీనం

బర్కత్‌పుర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో వ్యక్తి మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కాచిగూడ అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. రత్నానగర్‌కు చెందిన కృష్ణ(50) ఆర్టీసీ బస్టాండ్‌లో ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం చనిపోయి ఉండడంతో ప్రయాణికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. అనారోగ్యంతో చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ధనుర్మాస వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు నేటి నుంచి

చిక్కడపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని సుప్రసిద్ధ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకూ ధనుర్మాస వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు తెలిపారు. 16న ధనుర్మాస ఉత్సవ ఆరంభం, జనవరి 5 నుంచి 9 వరకు పహల్‌పత్తు ఉత్సవాలు, ఈ సందర్భంగా ఐదు రోజులు సాయంత్రం 6 గంటలకు దేవాలయ ద్వారబంధనము జరుగుతుందన్నారు. 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి భక్తులకు వైకుఠ ద్వార దర్శనం ఉంటుందన్నారు. 10 నుంచి 14వ తేదీ వరకూ రాపత్తు ఉత్సవాలు, 14 రాత్రి 7 గంటలకు నమ్మాళ్వార్ పరమ పదోత్సవం, 11న కూడారై ఉత్సవం, 13న భోగిపండుగ సందర్భంగా రాత్రి 7 గంటలకు గోదా సమేత రంగనాథస్వామివారి కల్యాణం, 14న మకర సంక్రమణ పర్వదినం ఉత్తరాయణ పుణ్యకాలం, 15న కనుమ పండుగ సందర్భంగా గోదా అమ్మవారి కరినోము ఉత్సవం జరుగుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంగమేశ్వర్

వీరశైవ లింగాయత్ లింగ బలిజ కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాంనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో వెనుకబడిన వీరశైవ లింగాయత్ లింగ బలిజ కులానికి వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం అధ్యక్షుడు సంగమేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బసవ భవనానికి గత ప్రభుత్వం భూమి పూజ చేసి మరిచిపోయిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని బసవ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించి వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు వెన్నె ఈశ్వరప్ప మాట్లాడుతూ.. రాష్ట్రంలో తమ కులస్తులు 40 లక్షలకు పైగా ఉన్నారని వారి అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి రాచప్ప, శివకుమార్, రవికుమార్, మల్లికార్జున్, శ్రావణి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 11న అధికారికంగా ఒడ్డె ఓబన్న జయంతి

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ తదితరులు

రాంనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జనవరి 11న ఒడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపెట్టి జైపాల్ తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం నాయకులు చెల్లంగుల కృష్ణయ్య అధ్యక్షతన రాష్ట్రంలోని వివిధ వడ్డెర కుల సంఘాలతో కలిసి ఒడ్డె ఓబన్న జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వడ్డెరుల అభివృద్ధి, సంక్షేమానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఓబన్న జయంతి ఉత్సవాల కమిటీలో రాష్ట్రంలోని అన్ని వడ్డెర కుల సంఘాల నాయకులను భాగస్వామ్యులను చేసి ఉత్సవాల కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వేముల వెంకటేష్, శివరాత్రి ఆయిలు మల్లు, మొగిలి సమ్మయ్య, రాజ్యలక్ష్మి, ఓర్సు శ్రీనివాస్‌రాజు, అనంతయ్య, లక్ష్మీనారాయణ, వెంకటేష్, రాములు, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఏర్పాటుపై రసాభాస

ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే ఒడ్డె ఓబన్న ఉత్సవాల కమిటీ విషయంపై సమావేశంలో చైర్మన్ జైపాల్‌కు సంఘం సభ్యులకు మధ్య వాదోపవాదాలు, ఆరోపణలు జరిగాయి. ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా అందరి ఆమోదం పొందిన వ్యక్తిని నియమించాలని, వైస్ చైర్మన్, డైరెక్టర్ల సభ్యుల నియామకంలో అన్ని సంఘాలకు ప్రాముఖ్యత కల్పించాలని చైర్మన్‌ను కోరారు. ఈ విషయంలో చైర్మన్ సభ్యుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి సమావేశం నుంచి బయటకు వెళ్లారు. జైపాల్ మాట్లాడుతూ అందరి అభీష్టం ప్రకారమే ఉత్సవాలు జరుపుతామని ప్రకటించారు.

ఆకట్టుకున్న పాటకు పట్టాభిషేకం


వైఎస్ రామకృష్ణకు బాలసుబ్రహ్మణ్యం సంగీత పురస్కారం బహూకరిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాటకు పట్టాభిషేకం కార్యక్రమం ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం త్యాగరాయగానసభలో అర్ధ శతాబ్ది స్వచ్ఛంద సంస్థ వంశీ ఆర్ట్ థియేటర్స్, వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మర్యాద రామన్న సినిమాలో ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం తొలి పాటతో సినీ రంగ ప్రవేశం చేసిన సందర్భంగా వైఎస్ రామకృష్ణ బృందంచే బాలు పాటకు పట్టాభిషేకం పేరిట సినీ గాన లహరి నిర్వహించారు. రామకృష్ణతో పాటు డా.శంకర్ రవీంద్రనాథ్, మణిబాబు, రమణమూర్తి, వీణ, రాధారాణి, పద్మశ్రీ, శ్యామల తదితరులు సోలో, యుగళ గీతాలలో పాలుపంచుకున్నారు. అనంతరం జరిగిన సభలో విదేశీ ఆంధ్రులైన ఉగాండా వంశీ ఫెస్టివల్స్ చైర్మన్ డా.బి వ్యాస కృష్ణ, దోహా(ఖతార్) నివాసి రచయిత్రి డా. వెంకట మాధవీలతలు పాల్గొని మాట్లాడారు. ప్రఖ్యాత గాయకుడు ఘంటసాల స్థానాన్ని భర్తీ చేసిన బాలసుబ్రహ్మణ్యం భిన్న భాషా చిత్రాలలో పాడి తన పేరు చిరస్థాయిగా నిలుపుకున్నారన్నారు. ఈ సందర్భంగా వైఎస్ రామకృష్ణను బాలసుబ్రహ్మణ్యం సంగీత పురస్కారంతో సత్కరించారు. అధ్యక్షత వహించిన వంశీ రామరాజు మాట్లాడుతూ బాలుకు తమ సంస్థతో ఉన్న అనుబంధం గుర్తు చేశారు. డా. తెన్నేటి సుధాదేవి, శైలజ, వంశీకృష్ణ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయగా సుధామయి వ్యాఖ్యానం చేశారు.

అద్భుతం పద్మమోహన్ నృత్యం


పద్మమోహన్‌ను సత్కరిస్తున్న జస్టిస్ మాధవి

చిక్కడపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శరీర కదలికలు, మనసు సమన్వయం అయితేనే నాట్యప్రదర్శన అర్థవంతంగా ఉంటుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి అన్నారు. వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యం లో ఆదివారం రాత్రి త్యాగరాయగానసభ లో పద్మమోహన్ దెందులూరిచే ఆంధ్రనాట్య ప్రదర్శన అద్భుతంగా జరిగింది. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా జస్టిస్ మాధవి పాల్గొని పద్మమోహన్‌ను ఆంధ్రనాట్య పితామహుడు నటరాజ రామకృష్ణ పేరిట జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించి మాట్లాడారు. నాట్యకళాకారుడు డా. కళాకృష్ణ, హరికథా కళాకారిణి ఉమామహేశ్వరి పాల్గొనగా వంశీరామరాజు అధ్యక్షత వహించారు.

భవితకు భరోసా భగవద్గీత శ్లోకాలు

లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి

ముషీరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భవితకు భరోసా భగవద్గీత శ్లోకాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్ర కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం డాక్టర్ కమలాకర్స్ మైండ్, పర్సనాలిటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లోని ఎస్సీ బాలికల ప్రభుత్వ వసతి గృహంలో భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. గెలిచిన విద్యార్థులకు కాస్మోటిక్స్, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులను, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. భగవద్గీత శ్లోకాలతో విద్యార్థులలో ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. నేటి ఆధునిక ప్రపంచంలో మనం ఎదుర్కొంటున్న సమస్యలకు భగవద్గీతలోని శ్లోకాలు మనకు ఆత్మబలాన్ని, ధైర్యాన్ని కలిగిస్తాయని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, సుహాసిని, రాంచంద్ర, జ్యోతిరాజా, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలి

చిక్కడపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎల్బీ స్టేడియంలో ఈనెల 21న నిర్వహించనున్న సీఎం క్రిస్మస్ వేడుకలను విజయంతం చేయాలని ఆలిండియా మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీలకురాలు డా. ఎస్తేర్‌రాణి పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ప్రార్థనామందిరంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రిష్టియన్‌ల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని తెలిపారు. ఈ వేడుకలకు క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ వినీల్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గాన్ని సమైక్యపరిచి పోరాటాలను ఉధృతం చేస్తాం

- టీయూసీఐ మహాసభలో పలువురు వక్తలు
- నూతన కమిటీ ఏకగ్రీవం


సమావేశంలో మాట్లాడుతున్న టీయూసీఐ నేత దొంతు రాజేష్ ఖన్నా

రాంనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాల్లో మార్పు రాకపోగా మరింత వేగంగా బడా కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలు అమలు చేస్తోందని పలువురు వక్తలు ఆరోపించారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. ముఖ్యంగా బహుళజాతి కంపెనీలకు అనుకూలమైన చట్టాలను రూపొందిస్తుందని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో కార్మికవర్గాన్ని సమైక్యపరిచి పోరాటాలను ఉధృతం చేయాలని వారు పిలుపునిచ్చారు. బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్‌భవన్‌లో టీయూసీఐ 5వ అఖిల భారత మహాసభలు ఆదివారం ముగిశాయి. టీయూసీఐ జాతీయ కార్యదర్శి రాజేష్‌ఖన్నా, టీయూసీఐ నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఫ్రెడ్డీ కె థాజత్, చార్లెస్ జార్జి, కార్యదర్శులు ఆదేశ్ బన్సోడే, మరీదు ప్రసాద్‌బాబు, బద్రీ ప్రసాద్ మిశ్రా, డి.రాజేష్, కోశాధికారి టి.బి.మినీ, కార్యవర్గ సభ్యులు రాకేష్‌వర్మ, కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కార్మికులు అంతర్జాతీయంగా పోరాడి, ప్రాణత్యాగాల ఫలితంగా సాధించుకున్న చట్టాలు, హక్కులను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. పని గంటల పెంపు, యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు, కనీస వేతనాల చట్టం, భద్రతా హక్కులు తదితర ఫ్యాక్టరీ చట్టాలను నిర్వీర్యం చేయడాన్ని ఖండించారు. అంతర్జాతీయ కార్మిక చట్టాలను కాపాడుకోవాలని, ఇందు కోసం జాతీయ, అంతర్జాతీయ ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశలో కార్యాచరణ రూపొందించుకుని కార్యక్రమాలు కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జనజాగృతి కళా మండలి బృందం మహ్మద్ కాశీం, లింగస్వామి నేతృత్వంలో కార్మికోద్యమ పాటలు ఆలపించాయి.